
04-04-2025
శుక్రవారం
మల్కాజిగిరి
jayabherinews
JAYABHERIDAILY.COM
తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 194 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



# హైదరాబాద్ లో భారీ వాన

2 లో

పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు మృతి..
రెండు తెలుగు రాష్ట్రాల్లో వాతావరణంలో ఒక్కసారిగా మార్పు కనిపించింది. కొన్ని జిల్లాల్లో ఎండలు దంచికొడుతుంటే.. మరికొన్ని జిల్లాల్లో వర్షాలు పడుతున్నాయి. హైదరాబాద్ లో మండుతున్న ఎండల నుంచి ఉపశమనం లభించింది. అకస్మాత్తుగా మధ్యాహ్నం వేళ వాతావరణం మారి.. చాలా ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. రాష్ట్రంలో పలు చోట్ల 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచాయి. నాగర్ కర్నూల్ జిల్లాలో భారీ వర్షం కురిసింది. పదర మండలం కోడోని పల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. పిడుగుపాటుకు ఇద్దరు మహిళలు మృతిచెందారు.
పొలంలో కూలీ పనులకు వెళ్లిన సమయంలో పిడుగులతో కూడిన భారీ వర్షం పడింది. పిడుగుపాటుకు పొలంలో పనిచేస్తున్న ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులను సుంకరి సైదమ్మ (35), ఈదమ్మ (55) గా పోలీసులు గుర్తించారు. మరో మహిళ సుంకరి లక్ష్మమ్మకు తీవ్రగాయాలు కాగా.. స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నాలుగు రోజుల పాటు తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ తెలిపింది.









# సోనియాతో నేతల భేటీ

- బీసీలకు మంత్రి పదవులపై చర్చ
- నేతలు మరింత కష్టపడాలి
- సోనియాగాంధీ దిశానిర్దేశం
- మంత్రివర్గ విస్తరణపై సుదీర్ఘ చర్చ

జయభేరి, న్యూఢిల్లీ :

ఢిల్లీ పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్ గాంధీని తెలంగాణ కాంగ్రెస్ నేతల బృందం కలిశారు. జంతర్ మంతర్‌లో బీసీ రిజర్వేషన్ల ధర్నా వివరాలను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మరో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వివరించారు. మంత్రులు, ఎంపీలను సోనియా గాంధీ ఆప్యాయంగా పలకరించారు. ఢిల్లీ పర్యటనలో తెలంగాణ కాంగ్రెస్ నేతల బృందం బిజీగా ఉన్నారు. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీని కలిశారు. మర్యాదపూర్వకంగా అధిష్టానం పెద్దలను కలిశారు. అధిష్టానం పెద్దలతో తెలంగాణ రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై నేతలు చర్చించారు. 2008లో సోనియా గాంధీని కలిశానని

...మిగతాది 2 లో

# కేటీఆర్ మాస్ వార్నింగ్

## 400 ఎకరాలు కొంటే.. అంతే...



జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 3:

రేవంత్ సర్కార్ పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీపై కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించే తీరు ఏ మాత్రం బాగోలేదని కేటీఆర్ ఫైరయ్యారు. విద్యార్థులను, ప్రకృతిని రేవంత్ ప్రభుత్వం నానా ఇబ్బందులు పెడుతోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్ లో మీడియాతో ఆయన మాట్లాడారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ వివాదంలో తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర విమర్శలు చేశారు. ఓ వైపు తెలంగాణ హైకోర్టు ఛీవాట్లు పెడుతున్నా.. ప్రభుత్వం తీరు మాత్రం మారడం లేదని మండిపడ్డారు. హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నా రేవంత్ సర్కార్ తీరు మారదా అని ప్రశ్నల వర్షం కురిపించారు. ముఖ్యమంత్రి అంటే బాస్ కాదని.. ప్రజా సేవకుడని కేటీఆర్ అన్నారు. అర్ధరాత్రి బుల్డోజర్లతో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోకి ఎందుకు వెళ్తున్నారని నిలదీశారు. ఇప్పటికే హైడ్రాపై తెలంగాణ హైకోర్టు

...మిగతాది 2 లో



# ట్రంప్ అన్నంత పని చేశారుగా


2 లో

# పల్లె నిద్ర చేయాలి

- నెలలో 4 రోజులు పల్లె నిద్ర

జయభేరి, విజయవాడ, ఏప్రిల్ 3:

ఎన్నాళ్లని అలా వదిలేస్తాం.. ఎవరికైనా చూపించండి.. అలా ఊరికే వదిలేయొద్దు.. అనేలా విశాఖ రిషికొండ భవనాలపై సీఎం చంద్రబాబు ఫోకస్ పెట్టారు. ఏపీ కేబినెట్‌లో ప్రత్యేకంగా మాట్లాడారు. రిషికొండ భవనాలను ఎలా ఉపయోగంలోకి తీసుకురావాలో మంత్రులతో ముఖ్యమంత్రి చర్చించారు. వారి సూచనలు కోరారు. మంత్రులంతా రుషికొండను సందర్శించి ఆ తర్వాత ఓ అభిప్రాయానికి రావాలని సూచించారు. ఇదే ఇప్పుడు ఆసక్తికర పరిణామం.జగన్ హయాంలో పర్యావరణ నిబంధనలకు తూట్లు పొడిచి.. విశాఖలోని రుషికొండను తవ్వేసి.. రెండు భారీ భవనాలను నిర్మించారు. నాలుగున్నర ఎకరాల్లో.. 400 కోట్లతో.. 5 లగ్జరీ బ్లాక్‌లు కట్టారు. కరెంట్ బిల్లులే నెలకు 25 లక్షల వరకూ వచ్చేలా అందులో హంగులు ఉన్నాయి. ఏపీ టూరిజం ఆధ్వర్యంలో కట్టినా.. అది జగన్ నివాసం కోసమేనని అన్నారు. సముద్ర తీరంలో.. విశాలంగా.. బెడ్‌రూమ్స్, డైనింగ్, లివింగ్, కన్వెన్షన్ రూమ్స్‌తో .. రాజభవనంలా ఉంటుంది. మొత్తం 1,48,413 చదరపు అడుగుల విస్తీర్ణం. స్క్వేర్ ఫీట్‌కు 30 వేలు ఖర్చు చేశారని అంటున్నారు. మెయిన్ డోర్ ఖరీదే 30 లక్షలకు పైనే. బాత్రూంలో అమర్చిన కమోడ్ రేట్ సుమారు 12 లక్షలు. స్నానం చేసే బాత్ టబ్‌కు ఇంకో 12 లక్షలు. వాష్‌బేషిన్ రెండున్నర లక్షలు. ఇంతటి లగ్జరీ ప్యాలెస్ చూసి అంతా అవాక్కయ్యారు.ఆ ఖరీదైన భవనాలను ఏం చేయాలో కూటమి ప్రభుత్వానికి అర్థం కావట్లేదు. ఏదైనా దేశపు ఎంబసీకి కానీ.. 7 స్టార్ట్ హోటల్‌కి కానీ అద్దెకు ఇవ్వాలనే ప్రపోజల్స్ ఉన్నాయి. తొలినాళ్లలో కాస్త హడావుడి



చేసినా.. ఆ తర్వాత సద్దుమనింగింది. లేటెస్ట్ కేబినెట్ మీటింగ్‌లో మళ్లీ రిషికొండ భవనాల మేటర్ తెరమీదకు వచ్చింది. త్వరలోనే మంత్రుల బృందం రిషికొండ ప్యాలెస్‌ను సందర్శించనుంది. ఆ తర్వాత సీఎం చంద్రబాబుకు సూచనలు చేయనున్నారు. ప్రస్తుతం ఆ బిల్డింగ్స్ కంప్లీట్‌గా వాడుకలో లేవు. కొందరు సెక్యూరిటీ గార్డ్స్ పర్యవేక్షిస్తున్నారు. రిషికొండ భవనాలను వాడుకలోకి తీసుకువస్తే జీవీఎంసీపై పడుతున్న భారమైనా తగ్గుతుందని భావిస్తున్నారు. ఇక, ఏపీ కేబినెట్‌లో మరో కీలక ప్రతిపాదన చేశారు సీఎం చంద్రబాబు. మంత్రులు, ఎమ్మెల్యేలు ఇకనుంచి గ్రామాల్లో "పల్లె నిద్ర" చేయాలని ఆదేశించారు. నెలలో 4 రోజులు పల్లె నిద్ర చేయాలని.. ప్రజల్లోకి వెళ్లి వారి సమస్యలు తెలుసుకోవాలని.. ప్రభుత్వ పథకాల గురించి వివరించి చెప్పాలని దిశానిర్దేశం చేశారు చంద్రబాబు.

# రాజ్యసభలో వక్ఫ్ బిల్లు

- వక్ఫ్ బోర్డులలో మహిళలకు ప్రాధాన్యం
- గిరిజన ఆస్తులకు రక్షణ కల్పిస్తూ వక్ఫ్ బిల్లు సవరణ
- లోక్ సభలో వక్ఫ్ సవరణ బిల్లుకు ఆమోదం

జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 3:

కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు నేడు రాజ్యసభలో వక్ఫ్ బోర్డు చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. లోక్‌సభలో 12 గంటల సుదీర్ఘ చర్చ అనంతరం ఆమోదం పొందిన మరుసటి రోజే ఈ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు.వక్ఫ్ ఆస్తులను ముస్లిమేతరులు నిర్వహిస్తారనే తప్పుడు అభిప్రాయాన్ని ప్రతిపక్షాలు వ్యాప్తి చేస్తున్నాయని, అందులో నిజం లేదని రిజిజు స్పష్టం చేశారు. వక్ఫ్ బోర్డు భారీ భూ బ్యాంకును కలిగి ఉన్నప్పటికీ ముస్లిం సమాజం ఎలా బాధపడుతోందో సచార్ కమిటీ నివేదిక పేర్కొన్న వైనాన్ని ఆయన ఉటంకించారు.రాజ్యసభలో రిజిజు మాట్లాడుతూ కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం 2013లో వక్ఫ్ బిల్లుకు సవరణలు చేసిందని, ఆ తప్పులను తాము తాజాగా చేసిన సవరణలు ఎలా సరిదిద్దుతాయో కూడా వివరించి చెప్పారు. వక్ఫ్ ఆస్తుల దుర్వినియోగాన్ని 2013లో



...మిగతాది 2 లో

# అమరావతికి 3500కోట్లు నిధులు విడుదల

2 లో

మొదటిపేజీ తరువాయి

## హైదరాబాద్ లో భారీ వాన

ఉత్తర తెలంగాణలో కొన్ని జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్, మరి కొన్ని జిల్లాలకు ఎల్లో అలెర్ట్ కూడా జారీ చేసింది. 2 నుంచి 4 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు తగ్గుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.ఛత్తీస్ గఢ్, నైరుతి మధ్యప్రదేశ్ ప్రాంతాలలో సముద్ర మట్టానికి 1.5 కి.మీల ఎత్తులో చక్రవాత ఆవర్తనం కొనసాగుతోంది. మధ్య మహారాష్ట్ర నుంచి కొమరిన్ ప్రాంతం వరకు కొనసాగిన ఉత్తర దక్షిణ ద్రోణి ఈ రోజు బలహీనపడింది. ఈ కారణంతోనే తెలంగాణ రాష్ట్రంలో వర్షాలు పడుతున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నేటి నుంచి 4 రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని అధికారులు వివరించారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులు వడగళ్లతో కూడిన వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు.

**ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్**

ఆరు జిల్లాలకు వాతావరణ శాఖ ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజమాబాద్ కామారెడ్డి జిల్లాలో ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. ఉరుములు, మెరుపులతో కూడి వర్షం పడే అవకాశం ఉందని అధికారులు చెప్పారు.

## సోనియాతో నేతల భేటీ

పాత జ్ఞాపకాలను ఆది శ్రీనివాస్ గుర్తు చేశారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై జంతర్ మంతర్‌లో పాల్గొన్నట్లు సోనియాకు విప్ ఆదిశ్రీనివాస్ వివరించారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేయాలని ఈ సందర్భంగా నేతలకు సోనియా గాంధీ దిశానిర్దేశం చేశారు. తెలంగాణ ప్రజలు ఎప్పుడూ కాంగ్రెస్‌కు వెన్నంటే ఉన్నారని వారికి చేసే మేలు ప్రజలు మరవరని అన్నారు. బీసీ రిజర్వేషన్లు బడుగు బలహీన వర్గాల జీవితాల్లో మార్పులు తెస్తాయని ఉద్ఘాటించారు. నేతలు మరింత కష్టపడాలని అందరికి సంక్షేమ పథకాలు అందించాలని సోనియా గాంధీ సూచించారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై పార్లమెంట్‌లో మోదీ ప్రభుత్వంతో బలంగా కొట్లాడుతామని రాహుల్ గాంధీ అన్నారు. కేంద్ర వైఖరిని మీరు ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాహుల్ గాంధీ తెలిపారు. సోనియా, రాహుల్ గాంధీ లతో భేటీ అనంతరం టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు.

**బీసీలకు మంత్రి పదవులపై చర్చ.**

బీసీలకు మరో రెండు మంత్రిపదవులు ఇవ్వాలని కోరామని. ఇద్దరికీ ఇచ్చే అవకాశం ఉందని టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బీసీలకు మంచి చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని చెప్పారు.

## కేటీఆర్ మాస్ వార్నింగ్

ఆగ్రహం వ్యక్తం చేసిందని కేటీఆర్ గుర్తు చేశారు.హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వివాదంలో విద్యార్థులను మంత్రులు చులకనగా మాట్లాడుతున్నారని కేటీఆర్ ఫైరయ్యారు. రేవంత్ సర్కార్ నిర్మించే ఫ్యూచర్ సిటీకి 14 వేల ఎకరాలు ఉండగా హెచ్‌సీయూ లో ఉన్న భూమిని ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. హెచ్‌సీయూ లో వన్యప్రాణులు లేవని ఎలా చెబుతారని కేటీఆర్ ప్రశ్నించారు. దయచేసి ప్రభుత్వం అమ్మకానికి పెట్టే కంచె గచ్చిబౌలి 400 ఎకరాలను ఎవరు కొనవద్దని అన్నారు. ఇప్పుడు కంచె గచ్చిబౌలి భూములను ఎవరు కొన్న తప్పకుండా ఇబ్బందులు పడాల్సి వస్తుందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చేది తమ ప్రభుత్వమేనని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని 400 ఎకరాలపై ఇదే తమ కమిట్ మెంట్ అని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అతి పెద్ద ఎకో పార్క్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఎవరైనా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు కొంటే మళ్లీ వెనక్కు తీసుకుంటామని కేటీఆర్ తేల్చిచెప్పారు. అద్భుతమైన పార్క్ గా మార్చి హెచ్‌సీయూకు కానుకగా ఇస్తామని కేటీఆర్ చెప్పుకొచ్చారు.రేవంత్ ప్రభుత్వానిది రియల్ ఎస్టేట్ ఆలోచన అని తీవ్ర ఆరోపణలు చేశారు. హెచ్‌సీయూ భూములపై ప్రభుత్వం వెనక్కి తగ్గకపోతే తాము ఉద్యమం చేస్తామని కేటీఆర్ హెచ్చరించారు. ప్రభుత్వ భూములంటే ప్రజలవే అని.. సీఎం ధర్మకర్త మాత్రమేనని అన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిందిపోయి.. ప్రభుత్వ పెద్దలు ఇష్టమొచ్చినట్లుగా చేస్తామంటే కుదరదని కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇప్పటికైనా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములపై రేవంత్ ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని ఆయన చెప్పారు.

## రాజ్యసభలో వక్ఫ్ బిల్లు

సెలెక్ట్ కమిటీ అంగీకరించిందని, దేశంలోనే ఇది మూడవ అతిపెద్ద భూ యజమానిగా ఉన్నప్పటికీ, మైనారిటీ వర్గానికి ప్రయోజనం చేకూర్చేందుకు వనరులను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైందని అన్నారు.వక్ఫ్ బోర్డుల కూర్పు గురించి వివరిస్తూ... కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో వక్ఫ్ బోర్డుల పాలకవర్గాల్లో మహిళా సభ్యులను చేర్చడానికి సంబంధించి ఒక ముఖ్యమైన సంస్కరణను తీసుకువచ్చామని మంత్రి తెలిపారు. కేంద్ర వక్ఫ్ మండలిలో 10 మంది సభ్యులు ఉంటారని, అందులో ఇద్దరు మహిళలు తప్పనిసరిగా ఉండాలని, నలుగురు వ్యక్తులు భారత ప్రభుత్వ అదనపు కార్యదర్శి వంటి జాతీయ స్థాయి ప్రముఖులు ఉంటారని కిరణ్ రిజిజు వివరించారు. రాష్ట్రాల్లోని వక్ఫ్ బోర్డులో 11 మంది సభ్యులు ఉంటారని, అందులో ముగ్గురు ముస్లిమేతరులు ఉండవచ్చని, ఇద్దరు మహిళలు తప్పనిసరిగా ఉండాలని ఆయన అన్నారు.వక్ఫ్ బోర్డులోని సెక్షన్ 40ను రద్దు చేశామని, దీని ద్వారా ఏ ఆస్తి అయినా తమదేనని మతపరమైన సంస్థ క్లెయిమ్ చేసే అధికారం ఉండేదని తెలిపారు. ప్రభుత్వ భూమిని వక్ఫ్ క్లెయిమ్ చేయకూడదని, షెడ్యూల్డ్ తెగల ఆస్తులను మార్చడానికి వీల్లేదని, వాటిని వక్ఫ్ ఆస్తులుగా ప్రకటించకూడదని స్పష్టం చేశారు. ఈ మేరకు రెండు పెద్ద సవరణలను చేశామని రిజిజు రాజ్యసభకు తెలియజేశారు.

భారతదేశంలో వక్ఫ్ ఆస్తుల నిర్వహణ, నియంత్రణకు సంబంధించి 1995లో వక్ఫ్ చట్టం అమలులోకి వచ్చింది. అయితే, ఈ చట్టం లోపభూయిష్టంగా ఉందంటూ మోదీ సర్కారు సవరణ తీసుకొచ్చింది. దీనికి నిన్న లోక్ సభ ఆమోదముద్ర వేసింది. ఇంతకీ ఈ మార్పుల సంగతి ఒక్కసారి చూద్దాం. 1995 లో చట్టం ముస్లిం సమాజంలో దానధర్మాల ఆస్తులను మతపరమైన, సామాజిక ఉద్దేశాల కోసం రక్షించడానికి రూపొందింది. అయితే, దీనిలో కొన్ని లోపాలు అవినీతి, ఆస్తుల దుర్వినియోగం, పారదర్శకత లేమి కారణంగా కేంద్ర ప్రభుత్వం 2025లో వక్ఫ్ (సవరణ) బిల్లును ప్రవేశపెట్టింది.1995 చట్టం ప్రకారం వక్ఫ్ అనేది ముస్లిం చట్టం కింద ఒక వ్యక్తి తన ఆస్తిని మతపరమైన, దాతృత్వ ఉద్దేశాల కోసం శాశ్వతంగా అంకితం చేయడం. ఇది మూడు రకాలుగా ఏర్పడుతుంది: 1) ప్రకటన ద్వారా, 2) దీర్ఘకాల వినియోగం ఆధారంగా (వక్ఫ్ బై యూజర్), 3) వారసత్వం అంతరించినప్పుడు (వక్ఫ్అలల్ఔలాద్). ఈ చట్టం కింద వక్ఫ్ బోర్డులకు ఆస్తులను నిర్వహించే, వాటిని వక్ఫ్‌గా ప్రకటించే అధికారం ఉంది. సర్వే కమిషనర్ ఆస్తుల సర్వే చేస్తారు. వివాదాలను వక్ఫ్ ట్రిబ్యునల్స్ పరిష్కరిస్తాయి, వీటి నిర్ణయాలు అంతిమంగా పరిగణిస్తారు. ఈ చట్టం ప్రకారం, వక్ఫ్ బోర్డు సభ్యులు ముస్లింలు మాత్రమే కావాలి, ఆస్తులపై బోర్డుకు పూర్తి నియంత్రణ ఉంటుంది. అయితే, ఈ విధానంలో పారదర్శకత లేకపోవడం, ఆస్తుల దుర్వినియోగం వంటి సమస్యలు ఎదురయ్యాయి. ఉదాహరణకు కొన్ని రాష్ట్రాల్లో వక్ఫ్ బోర్డులు ప్రభుత్వ ఆస్తులను కూడా వక్ఫ్‌గా ప్రకటించడం వివాదాస్పదమైంది. ఇక, కొత్తగా తెచ్చిన 2025 బిల్లు వక్ఫ్ చట్టాన్ని "యూనిఫైడ్ వక్ఫ్ మేనేజ్‌మెంట్, ఎంపవర్‌మెంట్, ఎఫిషియెన్సీ అండ్ డెవలప్‌మెంట్ యాక్ట్"గా పేరు మార్చుతోంది. ఈ బిల్లు పారదర్శకత, సాంకేతికత ఆధారిత నిర్వహణను లక్ష్యంగా పెట్టుకుంది. కొత్త నిబంధనల ప్రకారం, వక్ఫ్ ఆస్తిగా ప్రకటించాలంటే ఆ వ్యక్తి కనీసం ఐదేళ్లు ఇస్లాం ఆచరించి ఉండాలి. ఆస్తి అతని సొంతం కావాలి. తాజా చట్టంలో "వక్ఫ్ బై యూజర్" నిబంధన తొలగించబడింది. వక్ఫ్అలల్ఔలాద్‌లో స్త్రీలతో సహా వారసుల హక్కులు కాపాడబడతాయి. సర్వే బాధ్యత సర్వే కమిషనర్ నుండి జిల్లా కలెక్టర్‌కు మారింది. వక్ఫ్ ఆస్తుల వివరాలు ఆరు నెలల్లో కేంద్రీయ పోర్టల్‌లో నమోదు చేయాలి. వక్ఫ్ బోర్డుల్లో ఇద్దరు స్త్రీలతో పాటు ఇద్దరు ముస్లిం కాని సభ్యులను చేర్చాలి. ట్రిబ్యునల్ నిర్ణయాలు అంతిమం కావు. 90 రోజుల్లో హైకోర్టులో అప్పీల్ చేయవచ్చు. సెక్షన్ 40 తొలగించబడి, వక్ఫ్ బోర్డులు ఏకపక్షంగా ఆస్తులను వక్ఫ్‌గా ప్రకటించే అధికారం ఉండదు.1995 చట్టం వక్ఫ్ ఆస్తుల రక్షణపై దృష్టి పెట్టగా, 2025 బిల్లు పారదర్శకత, దుర్వినియోగ నివారణ, స్త్రీల హక్కుల సంరక్షణకు ప్రాధాన్యత ఇచ్చింది. అయితే, వక్ఫ్ బోర్డుల స్వయంప్రతిపత్తి తగ్గడం, ప్రభుత్వ జోక్యం పెరగడం వివాదాస్పదమైంది. ఈ సవరణలు ముస్లిం సమాజ ఆస్తుల నిర్వహణలో కొత్త దశను తెస్తాయా లేదా అన్నది చూడాలి.

# ట్రంప్ అన్నంత పని చేశారుగా...

**అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి భారత్ వంటి దేశాలపై ప్రతీకార సుంకాలు విధిస్తామని పలు సందర్భాల్లో హెచ్చరించిన డొనాల్డ్ ట్రంప్ అన్నంత పని చేశారు. భారత్ సహ వివిధ దేశాలపై ప్రతీకార సుంకాలను అమలులోకి తీసుకొచ్చారు.**




అమెరికా దేశ భవిష్యత్తు అమెరికన్ల చేతుల్లోనే ఉందని మరోసారి నొక్కి చెప్పారు.భారత్ సహా ఇతర దేశాలు తమపై విధిస్తున్న సుంకాల్లో తాము సగమే విధిస్తున్నాని, ఆయా దేశాలపై జాలితోనే ఇలా సగం సుంకాలు ప్రకటించినట్లు ట్రంప్ తెలిపారు. వీటిని రాయితీ టారిఫ్‌లుగా పేర్కొన్నారు. అయితే, భారత్‌పై ఇక తాము 26 శాతం మేర సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించారు. ఈ సందర్భంగా భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గురించి ప్రస్తావిస్తూ మోదీ తనకు గొప్ప స్నేహితుడని, అయితే భారత్ అమెరికాతో సరైన విధంగా వ్యవహరించడం లేదన్నారు.

అమెరికాపై 52 శాతం మేర సుంకాలు విధిస్తోందని మరోసారి గుర్తు చేశారు. మరోవైపు.. చైనాపై 34 శాతం మేర సుంకాలు విధిస్తున్నట్లు ట్రంప్ తెలిపారు. అమెరికాకు దిగుమతి అయ్యే అన్ని దేశాల ఉత్పత్తులపై కనీసం 10 శాతం సుంకాలు ఉంటాయని ప్రకటించారు.ఉత్పత్తులపై అమెరికా ప్రతీకార సుంకాలు విధించడం వల్ల ఫార్మా, వ్యవసాయం, రసాయనాలు, మెడికల్ డివైజెస్, ఎలక్ట్రికల్, మెషినరీ వంటి కీలక రంగాలపై ప్రతికూల ప్రభావం పడనుందని నిపుణులు చెబుతున్నారు. వియత్నాం నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై ఏకంగా 46 శాతం సుంకాలు విధిస్తున్నట్లు చెప్పారు ట్రంప్. స్విట్జర్లాండ్‌పై 31 శాతం, తైవాన్ పై 32 శాతం, బ్రిటన్ పై 10 శాతం, బ్రెజిల్ పై 10 శాతం, ఇండోనేషియాపై 32 శాతం, సింగపూర్‌పై 10 శాతం, దక్షిణాఫ్రికాపై 30 శాతం మేర ప్రతీకార సుంకాలు ప్రకటించారు.భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది కూడా దాదాపు 18 శాతం ఉత్పత్తులు ఎగుమతి అవుతాయి. ఈ సుంకాలు అమల్లోకి వచ్చిన తర్వాత, ఈ దిగుమతుల ధరలు పెరిగి, అమెరికా మార్కెట్‌లో వాటి పోటీదనాన్ని తగ్గించే అవకాశం ఉంది.

> **“ 2023, 24 ఆర్థిక సంవత్సరంలో, భారతదేశం మొత్తం ఎగుమతులు (వస్తువులు, సేవలు కలిపి) సుమారు 776 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇందులో అమెరికా భారతదేశం నుంచి ఎగుమతి చేసుకునే వస్తువుల విలువ సుమారు 77.5 బిలియన్ డాలర్లు (వస్తువులు మాత్రమే). ఇది భారతదేశం మొత్తం వస్తు ఎగుమతుల్లో (సుమారు 451 బిలియన్ డాలర్లు) దాదాపు 1718% ఉంటుంది.అంటే భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది సుమారు 1718%వస్తు ఉత్పత్తులు ఎగుమతి అవుతాయని చెప్పవచ్చు.**

ముఖ్యంగా ఈ క్రింది రంగాల్లో ఈ ప్రభావం స్పష్టంగా కనిపించవచ్చు.భారతదేశం ప్రపంచానికి ప్రధానంగా జనరిక్ ఔషధాలను సరఫరా చేసే దేశంగా ఉంది. అమెరికా మార్కెట్‌లో భారతీయ ఔషధ కంపెనీలు గొప్ప స్థాయిలో పోటీ చేస్తున్నాయి. అయితే 26% సుంకం వల్ల ఈ ఉత్పత్తుల ఖర్చులు పెరిగి, వాటి ధరలు ఎక్కువయ్యే అవకాశముంది. ఫలితంగా, అమెరికాలో భారత ఔషధాల అమ్మకాలు తగ్గొచ్చు.భారతదేశం అమెరికాకు భారీగా వస్త్రాలను ఎగుమతి చేస్తుంది. భారతీయ కాటన్, రేష్మి, ఇతర వస్త్ర ఉత్పత్తులు అమెరికా మార్కెట్‌లో ప్రముఖ స్థానాన్ని కలిగి ఉన్నాయి. అయితే, సుంకాల కారణంగా ధరలు పెరిగితే, ఇతర దేశాల పోటీ పెరిగి, భారత వస్త్ర వ్యాపారంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.భారతదేశం నుంచి అమెరికాకు పెద్ద మొత్తంలో ఆటో విడిభాగాలను ఎగుమతి చేస్తోంది. ఈ కొత్త సుంకాలు భారత ఆటోమొబైల్ పరిశ్రమను ప్రభావితం చేసి, అమెరికాలో భారతీయ ఆటో భాగాల వినియోగాన్ని తగ్గించవచ్చు. దీనివల్ల భారతదేశ ఆటోమొబైల్ కంపెనీలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. భారతదేశం నుంచి అమెరికాకు పెట్రోలియం ఉత్పత్తులు, రసాయన పదార్థాలు కూడా భారీగా ఎగుమతి అవుతున్నాయి. అయితే ఈ సుంకాల వల్ల, ఈ ఉత్పత్తులపై ఖర్చు పెరిగి, వాటి ఎగుమతికి ఆటంకం కలిగే అవకాశం ఉంది,భారతదేశం నుంచి అమెరికాకు ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, ఐటీ సంబంధిత హార్డ్‌వేర్ ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ రంగంలో ఇప్పటికే చైనా వంటి దేశాలతో పోటీ ఎక్కువగా ఉంది. ఇప్పుడు సుంకాల కారణంగా, భారత ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల పోటీదనం మరింత తగ్గే అవకాశం ఉంది.భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది ఎగుమతి అయ్యే ఉత్పత్తులు గణనీయమైన భాగాన్ని కలిగి ఉన్నాయి.

2023, 24 ఆర్థిక సంవత్సరంలో, భారతదేశం మొత్తం ఎగుమతులు (వస్తువులు, సేవలు కలిపి) సుమారు 776 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ఇందులో అమెరికా భారతదేశం నుంచి ఎగుమతి చేసుకునే వస్తువుల విలువ సుమారు 77.5 బిలియన్ డాలర్లు (వస్తువులు మాత్రమే). ఇది భారతదేశం మొత్తం వస్తు ఎగుమతుల్లో (సుమారు 451 బిలియన్ డాలర్లు) దాదాపు 1718% ఉంటుంది. అంటే భారతదేశం నుంచి అమెరికాకు ప్రతి ఏడాది సుమారు 1718% వస్తు ఉత్పత్తులు ఎగుమతి అవుతాయని చెప్పవచ్చు. ఈ ఉత్పత్తుల్లో ప్రధానంగా ఫార్మాస్యూటికల్స్, రత్నాలు, ఆభరణాలు, టెక్స్‌టైల్స్, పెట్రోలియం ఉత్పత్తులు, ఎలక్ట్రానిక్ వస్తువులు ఉంటాయి. దీంతో అమెరికా భారతదేశానికి అతిపెద్ద ఎగుమతి మార్కెట్‌గా ఉంది. ఆ తర్వాత యూఏఈ, చైనా వంటి దేశాలు ఉన్నాయి.ఇక భారతదేశం విదేశాల నుంచి దిగుమతులు చేసుకునే వస్తువుల్లో అమెరికా కీలకమైన భాగస్వామిగా ఉంది. 202324 ఆర్థిక సంవత్సరంలో, భారత్ మొత్తం దిగుమతుల విలువ సుమారు 732 బిలియన్ డాలర్లు. ఇందులో అమెరికా నుంచి దిగుమతులు 42.12 బిలియన్ డాలర్లు, అంటే సుమారు 5.75%. అంటే, ప్రతి ఏడాది భారత్ దిగుమతులలో అమెరికా వాటా సుమారు 56%గా ఉంటుందిభారతదేశం అమెరికా నుంచి దిగుమతి చేసుకునే ప్రధాన వస్తువులలో క్రూడ్ పెట్రోలియం (ముడి చమురు), బొగ్గు ఉత్పత్తులు (కోల్ బ్రికెట్స్) ,గ్యాస్ టర్బైన్స్, ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, రత్నాలు, ఆభరణాలు ఉన్నాయి. అమెరికా భారత్‌కు ముఖ్యమైన వ్యాపార భాగస్వామిగా ఉన్నప్పటికీ, చైనా (17%), రష్యా (9%) పెద్ద వాటా కలిగి ఉండటం విశేషం. అయినప్పటికీ, అమెరికా నుంచి వచ్చే టెక్నాలజీ ఉత్పత్తులు, ఖరీదైన రత్నాలు, ఇంధన వనరులు భారత మార్కెట్‌ను ప్రభావితం చేస్తున్నాయి.



# అమరావతికి ప్రపంచబ్యాంక్ నిధులు విడుదల 3500కోట్లు

✍ **జయభేరి, విజయవాడ, ఏప్రిల్ 3:**

ప్రజా రాజధాని అమరావతి మరో ముందడుగు వేస్తోంది. అమరావతి సుస్థిర అభివృద్ధి ప్రాజెక్ట్‌కు భారీ సాయం అందింది. అమరావతి ప్రాజెక్టు ఆర్థిక సాయానికి ఇచ్చిన హామీ మేరకు.. ప్రపంచ బ్యాంక్ నిధులు విడుదల చేసింది. మొదటి విడతగా రు. 3535కోట్ల రుణాన్ని ప్రపంచ బ్యాంక్ విడుదల చేసింది. ఈ మొత్తం ఇవాళ ఏపీ ఖాతాలకు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి, వరల్డ్ బ్యాంక్, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, కేంద్ర ప్రభుత్వం, HUDCO సహా పలు సంస్థలు ఈ ప్రాజెక్ట్‌కు నిధులు సమకూర్చుతున్నాయి. ఈ నిధులతో అమరావతిని ఆధునిక, వాతావరణస్థిరమైన నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి.వరల్డ్ బ్యాంక్ అమరావతి అభివృద్ధి కోసం ₹3,535 కోట్లను మొదటి విడతగా విడుదల చేసింది. ఈ నిధులు త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలకు జమ కానున్నాయి. అమరావతి ప్రాజెక్టు 6800కోట్ల ( $800 మిలియన్లు, ) . అందించేందుకు అక్టోబర్‌లో జరిగిన వరల్డ్ బ్యాంక్ గవర్నింగ్ బాడీ సమావేశంలోనే ఆమోదించారు.అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద, నగరం మొదటి దశ అభివృద్ధికి వరల్డ్ బ్యాంక్ సహాయం అందిస్తుంది. ఈ కార్యక్రమం సంస్థలను బలోపేతం చేయడానికి, రాష్ట్రాన్ని గ్రోత్ సెంటర్‌గా , Inclusive సిటీగా నిర్మించడానికి, నివాసితులకు అవకాశాలను సృష్టించడానికి సహాయపడుతుంది.2050 నాటికి 35 లక్షల మంది జనాభాను సమకూర్చేందుకు 217 చదరపు కిలోమీటర్ల నగరం కోసం ఏపీప్రభుత్వం మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసిందని...ప్రస్తుతం అమరావతి ప్రాంతంలో సుమారు 1 లక్ష మంది నివసిస్తున్నారని ప్రపంచబ్యాంక్ తన నివేదికలో పొందుపరిచింది. నగర రవాణా అవసరాలను ప్లాన్ చేయడానికి, నిర్వహించడానికి కొత్త ఏకీకృత మెట్రోపాలిటన్ రవాణా అథారిటీని స్థాపించడంలోనూ... నీటి సరఫరా, మురుగునీటి వంటి ప్రాథమిక సేవల కోసం ఈ నిధులు ఉపయోగపడతాయని చెప్పింది.

అమరావతి నగరం కోసం ఆంధ్రప్రదేశ్ క్యాపిటల్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ వాతావరణస్థిరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తుంది. ఇందులో 320 కిలోమీటర్ల ఆర్టీరియల్ రోడ్ గ్రిడ్, కార్బన్ ఫుట్‌ప్రింట్ తక్కువ ఉండే 1,280 కిలోమీటర్ల నైబర్‌హుడ్ రోడ్లు, విద్యుత్ , టెలికమ్యూనికేషన్ కనెక్టివిటీ కోసం డక్ట్‌లు, నీటి సరఫరా, మురుగునీరు, వర్షపు నీటి డ్రైనేజీ కోసం నగరవ్యాప్త వ్యవస్థలు ఉంటాయి. భవిష్యత్ వరదల ప్రమాదాలను తట్టుకునేందుకు వరద నిర్వహణ వ్యవస్థను రూపొందిస్తారు. ఇందులో ప్రకృతి ఆధారిత పరిష్కారాలు, 30 శాతం భూమిని ఖాళీ స్థలాలుగా రిజర్వ్ చేయడం, నీటి నిల్వ రిజర్వాయర్లు సృష్టించడం, బలమైన వరద రక్షణ మౌలిక సదుపాయాల నిర్మాణం, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలు ఉంటాయి.కేవలం మౌలిక సదుపాయాల కల్పన మాత్రమే కాకుండా.. వతి మాస్టర్ ప్లాన్‌లో నివాస ప్రాంతంలో 22 శాతం భూమి పేదల గృహ నిర్మాణం కోసం కేటాయించారని, మహిళలు, యువత నైపుణ్యానికి కూడా నిధులు వినియోగిస్తారని ప్రపంచబ్యాంక్ తెలిపింది.

ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ కూడా అమరావతి కోసం ₹6,700 కోట్ల రుణాన్ని ఆమోదించింది. ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ADB నుండి $788.8 మిలియన్ల రుణానికి అక్టోబర్‌లోనే ఆమోదం లభించింది. మొదటి విడత త్వరలో అందుబాటులోకి రానుంది. కేంద్ర ప్రభుత్వం అమరావతి అభివృద్ధికి ప్రత్యేక సహాయంగా ₹1,400 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులు ప్రాజెక్ట్‌కు అదనపు ఊతం ఇవ్వనున్నాయి.హౌసింగ్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అమరావతి కోసం ₹11,000 కోట్ల రుణాన్ని అందించేందుకు అనుమతి లేఖను ఇప్పటికే సమర్పించింది. ఈ రుణం నిర్మాణ కార్యకలాపాలను వేగవంతం చేయడంలో సహాయపడుతుంది.జర్మన్ ఆర్థిక సంస్థ నుంచి ₹5,000 కోట్ల నిధులు కూడా అందే ప్రక్రియలో ఉన్నట్లు సమాచారం. ఈ విషయంపై మరింత స్పష్టత కోసం అధికారిక నిర్ధారణ కావాల్సి ఉంది.

# జోరుగా మట్టి దందా..
# బేస్ మెంట్ పేరిట మట్టి విక్రయాలు

- తెరవెనుక కాంగ్రెస్ నేత...
- అధికారులకు సమాచారం అందిస్తామంటూ చేతులు దులుపుకుంటున్న వైనం...

**జయభేరి, ఏప్రిల్ 3:**



మూడు చింతలపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో మట్టి దందా జోరుగా సాగుతోంది. రెవిన్యూ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు తీస్కుంటుండడంతో అక్రమార్కులు రూటు మార్చి చెరువులు, కుంటలు, అటవీ భూముల పై కన్నేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారం లో ఉండడం తాము అదే పార్టీకి చెందిన వారు కావడంతో ఎక్కడబడితే అక్కడ మట్టిని తవ్వేస్తున్నారు. తమ రాజకీయ పలుకుబడి ని ఉపయోగించి చెరువులను కుంటలను కుళ్లగొడుతున్నారు. నాయకుడంటే ప్రజలకు సేవ చేసేవారని అర్థం కాని ఇక్కడ విచిత్రం ఏమిటంటే నాయకుడే అక్రమార్కుడిలా దర్శనమిస్తూ దందా కొనసాగిస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలియదా అంటే తెలుసు కానీ మాకెందుకులే అందినకాడికి పుచ్చుకొని గపచుప్ గా ఉన్నామా అనే తీరులో ఇరిగేషన్ శాఖ అధికారులు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

**బేస్ మెంట్ పేరిట మట్టి బయటకి..**

కొల్తుర్ గ్రామ పరిధిలో ఉన్న చెరువులో నుంచి కొందరు అక్రమార్కులు మట్టిని తవ్వేస్తున్నారు. గత కొద్ది రోజుల క్రితం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దగ్గరుండి బేస్మెంట్ పేరిట మట్టిని తరలించారు. ఈ విషయమై అధికారులకు ఫిర్యాదు రావడంతో విచారణకు వెళ్లిన అధికారులు ఫోటోలకు ఫోజులిచ్చామ అన్నట్టుగా మొక్కుబడిగా ఫోటోలు తీసుకొని వెనక్కి వచ్చారు. సామాన్య ప్రజలు తమ అవసరాలకు మట్టిని తవ్వేందుకు అనుమతులు అడిగితే ససేమిరా అంటూ ఆగమేఘాల పై విచారణ జరిపి కేసులు నమోదుచేస్తారు. అలాంటిది ఆ నేత కొన్ని వందల ట్రిప్పుల మట్టిని అక్రమంగా అనుమతులు లేకుండా మట్టిని బయటకి తరలిస్తే మాత్రం చర్యలు శూన్యమా అంటూ సామాన్యుడికి ఒక న్యాయం బడా బడా నాయకులుగా చెలామణి అయ్యే వారికి ఒక న్యాయమా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



> **ఇరిగేషన్ అధికారుల వివరణ కోరగా...**
> **చర్యలు తీసుకుంటాం...**
> **స్వప్న, ఇర్రిగేషన్ ఏఈ**
>
> మాకు మట్టిని తవ్వి బయటకి తరలిస్తున్నారని వచ్చిన ఫిర్యాదు వాస్తవమే. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం మా పై అధికారులకు విషయం తెలియజేస్తా..

**ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం..**
**మముళ్ళతో మేనేజ్....**

అక్రమంగా చెరువులో నుంచి మట్టి తరలించారని ఫిర్యాదు చేసిన ఇర్రిగేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. చెరువులను, కుంటలను కాపాడాల్సిన అధికారులే అక్రమార్కులతో చేతులు కలిపి భక్షిస్తున్నారని ప్రజలు బహిరంగంగా నే చర్చించుకుంటున్నారు. మట్టిని తవ్వాలంటే ముందుగా మైనింగ్, ఇర్రిగేషన్ శాఖ ల నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది రాయల్టీ చెల్లించాల్సి ఉంటుంది.

కానీ ఇక్కడ అక్రమార్కులు మాత్రం ఇర్రిగేషన్ శాఖ అధికారులను మేనేజ్ చేస్తూ నిబంధనలను తుంగలో తొక్కి సహజ సంపదను కొల్లగొడుతూ లక్షలు సంపాదిస్తున్నారు. వచ్చేది వర్షం కాలం ఇలా చెరువులను బేస్మెంట్ పేరిట తవ్వుకుంటూ పోతే గుంతలు పెద్దగా ఏర్పడి పశువులు చనిపోవడం కానీ ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు భాధ్యత వహిస్తారని ప్రజలు మండిపడుతున్నారు.

ఏమైనా అంటే మా పై అధికారులకు సమాచారం అందిస్తాం అంటూ ఇరిగేషన్ అధికారులు చేతులు దులుపేసుకుంటున్నారు. ఇప్పటికైనా అధికారులు నిద్రమత్తులో నుంచి తేరుకొని విచారణ చేపట్టి అక్రమార్కుల పై కఠిన చర్యలు తీసుకోవాలని లేదంటే కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని అధికారులను హెచ్చరిస్తున్నారు...



## అకాల వర్షా నికి.. ప్రహరి గోడ కూలి ఓ వ్యక్తి మృతి

- తీవ్రంగా గాయపడిన మరో ఇద్దరు వ్యక్తులు
- చికిత్స నిమిత్తం గజ్వేల్ ఆసపత్రికి తరలింపు

**జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 03 :**

ఈదురు గాలులతో కూడిన వర్షానికి గిడ్డంగి గోడ కూలీ వ్యక్తి మృతి ,మరో ఇద్దరికి తీవ్ర గాయపడిన సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం జాలిగామలో చోటుచేసుకుంది. మృతి చెందిన వ్యక్తి గజ్వేల్ పట్టణానికి చెందిన హిమ్మత్ ఖాన్. వయసు 45 సం వృతి రీత్యా ఎలక్ట్రిషన్, ప్లంబర్ పనులు చేసి కుటుంబాన్ని పోషిస్తున్నాడు. జాలిగామ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఓ గోడౌన్ లో ఎలక్ట్రిషన్, ప్లంబర్ పనులను చేసేందుకు గురువారం వెళ్లారు ఈదురు గాలులతో కూడిన వర్షంతో గిడ్డంగి చుట్టూ పోసిన మట్టి కృంగి ప్రహరి గోడ కూలీ హిమ్మత్ ఖాన్ పై పడింది. దీంతో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు .విషయం తెలుసుకున్న మృతుడి కుటుంబీకులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. గాయపడిన ఇద్దరు వ్యక్తులను చికిత్స నిమిత్తం అంబులెన్స్ లో గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## కమిషనర్ కు ప్రశంస పత్రం అందజేత




**జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 03 :**

గత రెండు సంవత్సరాల నుండి 80 శాతం పైగా ఇంటి పనులు వసూలు చేసినటువంటి మున్సిపల్ కమీషనర్ గోల్కొండ నర్సయ్యకు, గౌరవ కమీషనర్ అండ్ డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సిడిఎంఏ) శ్రీదేవి చేతుల మీదుగా ప్రశంస పత్రం తీసుకోవడం జరిగినది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ మీడియా సమవేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమీషనర్ మాట్లాడుతూ పన్నుల వసూళ్లలో సహకరించిన ప్రతి యొక్క సెక్షన్ హెడ్స్, సిబ్బందికి పేరు పేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## డివిజన్ లోని ప్రతి కాలనీని ఆదర్శంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం

- GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి

**జయభేరి, హయత్ నగర్ :**



మన్సూరాబాద్ డివిజన్ హయత్ నగర్ ప్రాంతంలోని నూతనంగా ఏర్పాటు చేసుకున్న శ్రీ వెంకటేశ్వర నగర్ కాలనీలో మార్నింగ్ వాక్ కార్యక్రమంలో భాగంగా GHMC డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి కాలనీ సంక్షేమ సభ్యులతో కలిసి పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నూతనంగా భూగర్భ డ్రైనేజ్ లైన్లకు సుమారు రూ: 23.00 లక్షల వ్యయంతో సాంక్షన్ కావడం జరిగింది డ్రైనేజీ లైన్లు నిర్మించుకున్న తర్వాత మరో 4 నుండి 5 నెలల్లో సి.సి రోడ్లు నిర్మించుకుందామని, డ్రైనేజీ లైన్ల కొరకు సరైన లెవెల్స్ ను సమకూర్చేందుకు ముందుగా జల మండలి అధికారులను పిలిపించి పర్యేక్షించిన అనంతరం పనులను ప్రారంభించుకుందామని కాలనీవాసులు తెలియజేశారు. కాలనీకి భూగర్భ డ్రైనేజ్ లైన్లో శాంక్షన్ చేయించినందుకు కాలనీవాసులు కార్పొరేటర్ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. అదేవిధంగా చుట్టుపక్కల ఉన్న కాలనీవాసులకు చెత్తను రోడ్లపై, ఖాళీ స్థలాలలో వేయకుండా దయచేసి స్వచ్ఛ ఆటో లోనే వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సభ్యులు వెంకటయ్య, నాగేశ్వరరావు, నునావత్ చిన్నయ్య, రమేష్, సత్యనారాయణ, శివప్రసాద్, చందు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫీర్జాదిగూడాలో కమీషన్ల కక్కుర్తి

- ఫీర్జాదిగూడాలో ఆటవిక రాజ్యాన్ని తలపిస్తున్న పరిస్థితులు
- బిజెపి మేడ్చల్ నియోజకవర్గ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అభ్యర్థి ఏనుగు సుదర్శన్ రెడ్డి

**జయభేరి, మేడిపల్లి :**



ప్రపంచం శరవేగంగా అభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతుంటే మేడ్చల్ నియోజకవర్గం ఫీర్జాదిగూడా కార్పొరేషన్ పరిధిలో మాత్రం కమిషన్ల కొరకు కక్కుర్తి పడి పూర్వం ఆటవిక సమాజంలో ఉన్నటువంటి విదంగా పారిశుద్యం, తాగు నీరు కలిసిన వాటిని ప్రజలు ఉపయోగించాల్సిన పరిస్థితి పాలకులు, అధికారుల యొక్క అసమర్థత నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఫిర్జాదిగూడా మున్సిపల్ కార్పొరేషన్ ఈస్ట్ అధ్యక్షుడు ప్రబాకర్ రెడ్డి, జిల్లా యువ మెర్చా అధ్యక్షుడు పవన్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు బాలరాజు గౌడ్, జైపాల్ రెడ్డితో కలిసి అయోధ్య నగర్, సుమా రెసిడెన్సీ కాలనీలలో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత పాలకవర్గం, ప్రభుత్వం గొప్పలు చెప్పుకున్న స్ట్రాటజిక్ నాలా డెవలప్మెంట్ ప్రోగ్రాంలో చేపట్టిన పనులు కమిషన్ల కొరకు అధికారులు నేతల మధ్య కొరవడిన సమన్వయం వల్ల వారు రోజు జీవితం దుర్భరంగా మారిన పరిస్థితి ఏర్పడింది అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్పొరేషన్ పరిధిలో గతంలో భారాస నేతలుగా చెలామణి అయిన వారే నేడు అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులుగా రూపాంతరం చెందినప్పటికీ పనితీరు మాత్రం నాసిరకంగానే ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికైనా దాంబీకలు మాని సమస్యను త్వరితగతిన పూర్తి చేయాలని లేని యడల బిజెపి పార్టీ శ్రేణులతో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాలాని అధ్యక్షులు, కార్యదర్శులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

- దివ్యాని ట్రస్ట్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు
- కార్యక్రమంలో పాల్గొన్న టివి5 వైస్ చైర్మన్ సాంబశివరావు

**జయభేరి, మేడ్చల్ :**



వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని టివి5 వైస్ చైర్మన్ సాంబశివరావు అన్నారు. బుధవారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ 4వ వార్డులో ప్రతి సంవత్సరం మాదిరిగానే దివ్యాని ట్రస్ట్ చైర్మన్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని టీవీ5 వైఎస్ చైర్మన్ సాంబశివరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండాకాలంలో పది మందికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేస్తున్న మురళీకృష్ణ ను అభినందించారు. సమాజంపై గౌరవంతో ప్రజలకు మంచి చేయాలనే ఆశయంతో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని సాంబశివరావు అన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాని ట్రస్ట్ చైర్మన్ మురళీ కృష్ణ, బీజేపీ నాయకులు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి, అమరం మోహన్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ అమరం సరస్వతీ, యాదగిరి గౌడ్, సుంకు నవీన్, చెంచాల సురేష్, కొండయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



## ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

**జయభేరి, కాప్రా :**

కాప్రా డివిజన్ పరిధిలోని వంపు గూడ కమ్యూనిటీ హాల్ వద్ద నూతనంగా ఏర్పాటు చేస్తున్న బంగారు మైసమ్మ దేవాలయం నూతన ఆలయానికి భూమి పూజ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరై ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ బంగారు మైసమ్మ తల్లి ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, కిట్టు ఆలయ కమిటీ సభ్యులు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## సినీ టైలర్ షాప్ నీ ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే




**జయభేరి, కాప్రా :**

సాయిలోక్ కాలనీ, జమ్మిగడ్డలో భరత్ నగర్ కాలనీ ప్రెసిడెంట్ లక్ష్మి నారాయణ నూతనంగా ఏర్పాటు చేసిన సినీ టైలర్ షాప్ ని ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి. ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు వ్యాపార రంగంలో రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ నాయకులు మహేష్ గౌడ్, Dr AS Rao Nagar డివిజన్ మాజీ ప్రధాన కార్యదర్శి కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తి




**జయభేరి, కాప్రా :**

తెలంగాణ చైతన్య జ్వాల, సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జయంతి సందర్భంగా వారికి మల్లాపూర్ డివిజన్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద గల బీరప్ప దేవాలయం ముందు ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య పోరాట స్ఫూర్తిని పుణికి పుచ్చుకొని సాధించుకున్న తెలంగాణ రాష్ట్ర అస్తిత్వాన్ని కాపాడుకునేందుకు పునరంకితమవుదాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ కార్పొరేటర్ ప్రభుదాస్ BRS పార్టీ రాష్ట్ర నాయకులు సాయి జెన్ శేఖర్, హమాలీ శ్రీనివాస్, గట్టయ్య, బక్కయ్య వీర స్వామి, మల్లేష్ బండి లింగంతదితరులు పాల్గొన్నారు.

## మహిళలను పారిశ్రమవేత్తలుగా చూడాలి

- ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి
- మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుంది



**జయభేరి, పరకాల, ఏప్రిల్ 03:**

గురువారం పరకాల నియోజకవర్గంలోని దామెర మండలం ల్యాదల్ల గ్రామంలో ఏర్పాటు చేయనున్న స్కిల్ డెవలప్మెంట్ అండ్ మినీ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ ఫర్ ఉమెన్ సెంటర్ పనులను జిల్లా కలెక్టర్ తో పాటు అధికారులతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో స్కిన్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మహిళా సోదరీమణులను కోటీశ్వరులు చేయాలననే సంకల్పంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి ఒక స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తున్నామని తద్వారా ఇంటర్నేషనల్ స్థాయిలో ప్రొడక్ట్స్ ని తయారు చేయగలుగుతామని అన్నారు. ల్యాదల్లలో సెంటర్ ఏర్పాటు చేయడం వల్ల ఆత్మకూరు, దామెర, నడికూడ, పరకాల రూరల్, టౌన్ మహిళలకు అందుబాటులో ఉంటుందని అన్నారు. స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా ప్రతి ప్రతి ఇంట్లో ఒకరికి ఉపాధి అవకాశాలు పొందుతారని, త్వరలో దామెర మండల కేంద్రంలో డైరీ సెంటర్ ను కూడా ఏర్పాటు చేయబోతున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని, అలాగే నిరుద్యోగ యువతకి ఈనెల 4వ తేదీన మెగా జాబ్ మేళా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.



## బస్సు సౌకర్యం కోసం వినతి

**జయభేరి, మేడ్చల్ జిల్లా:**

మేడ్చల్ పట్టణంలోని రాఘవేంద్ర నగర్, బాలాజీ నగర్ మీదుగా ఆర్టీసీ బస్సు నడపాలని కాలనీవాసులు డిపో మేనేజర్ కు గురువారం వినతి పత్రం సమర్పించారు. షామీర్పేట వైపు వెళ్లే బస్సులను బాలాజీ నగర్, కేవెల్ ఆర్ నగర్, రాఘవేంద్ర నగర్ గా మీదుగా నడిపితే ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. అలాగే విద్యార్థుల సమయసారానికి అనుగుణంగా బస్సును నడిపించాలని కోరారు. ఇందుకు దుకు ఆయన సానుకూలంగా స్పందిస్తూ సాధ్య సాధ్యాలను పరిశీలించి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యపాల్ రెడ్డి, మురళి, మహిపాల్ రెడ్డి, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు

- అలియాబాద్ గ్రామంలో ఈ నెల 5 నుంచి శ్రీరామ చంద్రస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం



**జయభేరి, ఏప్రిల్ 3:-**

శ్రీరామ నవమినీ పురస్కరించుకుని శామీర్ పేట మండలం అలియాబాద్ గ్రామంలోని శ్రీరామ చంద్రస్వామి ఆలయం ముస్తాబవుతోంది. అదేవిధంగా ఈ నెల 5 నుండి 12 వ తేదీ వరకు ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 5వ తేదిన గణపతి పూజ, స్వస్తివచనము, భేరిపూజ, 6న శ్రీరామ చంద్రస్వామి అభిషేకము, ఎదుర్కోలు, సీతారాముల కళ్యాణం, 10న నాకబలి, 12న తెల్లవారు జామున స్వామివారి రథోత్సవం, జాతర నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని నిర్వహాకులు కోరారు.

## వేతనాలు చెల్లించాలని వినతి

- అలియాబాద్ గ్రామ పంచాయతీ కార్యాలయం ముందు పంచాయతీ సిబ్బంది నిరసన



**జయభేరి, ఏప్రిల్ 3:**

శామీర్ పేట మండలం అలియాబాద్ గ్రామపంచాయతీ కార్యాలయం ముందు పంచాయతీ సిబ్బంది నిరసన చేపట్టారు. గత నాలుగు నెలల నుంచి తమకు వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధికి తమ వంతుగా కృషి చేస్తున్న ప్రభుత్వం తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు . వేతనాలు రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని అన్నారు. అధికారులు, నేతలు స్పందించి తమకు వేతనాలు అందేలా చూడాలని వారు విజ్ఞప్తి చేశారు.

## మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ కు బాంబు బెదిరింపు కలకలం

- తనిఖీ చేసిన బాంబు స్క్వాడ్
- విచారణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశం



**జయభేరి, ఏప్రిల్ 3:**

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టరేట్ కు గురువారం మెయిల్ లో బాంబు బెదిరింపు మెసేజ్ కలకలం రేపింది. బెదిరింపు మెసేజ్ రావడంతో అప్రమత్తమైన జిల్లా కలెక్టర్ గౌతం వెంటనే పోలీస్ శాఖ వారికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన బాంబు స్క్వాడ్, పోలీస్ బృందాలు అక్కడకు చేరుకుని కలెక్టరేట్ కార్యాలయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి బాంబు బెదిరింపు తప్పుడు సమాచారం అని జిల్లా కలెక్టర్ గౌతమ్ కు తెలిపారు. బాంబు బెదిరింపు పై తదుపరి విచారణ చేయాలని జిల్లా కలెక్టర్ పోలీసులను ఆదేశించారు.

## వ్యభిచారం గుట్టు రట్టు

- ఐదుగురు మహిళలు, ముగ్గురు విటులు అరెస్ట్

**జయభేరి, శ్రీకాళహస్తి:**

శ్రీకాళహస్తి పట్టణంలోని తేరువీధి జంక్షన్ వద్ద ఉన్న అష్టలక్ష్మి రెసిడెన్సి లో గుట్టుగా జరుగుతున్న వ్యభిచారం గుట్టు రట్టు అయింది. వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారంతో వన్ టౌన్ పోలీసులు దాడులు జరిపారు. అష్టలక్ష్మి లాడ్జి పై దాడి చేసి ఐదుగురు మహిళలు, ముగ్గురు విటులను పోలీస్ స్టేషన్ కు తరలించారు. మహిళలు ఎక్కడి వారు పురుషులు ఎవరు అన్న కోణంలో విచారణ జరుపుతున్నారు.

# డిగ్రీ కళాశాలలో అటానమస్ వార్షికోత్సవం

**జయభేరి, గజ్వేల్, ఏప్రిల్ 03 :**




ప్రభుత్వ డిగ్రీ కోఎడ్యుకేషన్ కళాశాల (అటానమస) లో కళాశాల వార్షికోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నిక్కత్ అంజుమ్ అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా ప్రముఖ విద్యావేత్త, మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. శ్రీనివాసరెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కళాశాల లో చదువుతున్న విద్యార్థులు అదృష్టవంతులు అన్నారు. ఈ కళాశాలలో ఉన్నన్ని మౌలిక సదుపాయాలు తెలంగాణలోని కాకుండా యావత్ భారతదేశం లో ఏ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్ని మౌలిక సదుపాయాలు విద్యార్థులకు కల్పించడం లేదన్నారు. విద్యార్థులు తమ భవిష్యత్తు కోసం విద్యార్థి దశలో సుమారు ఐదు సంవత్సరాలు పట్టుదలతో, శ్రద్ధతో అంకుటిత దీక్షతో చదువుతే జీవితాంతం సుఖపడవచ్చు అన్నారు. అలా కాకుండా విద్యార్థి దశలో సమయాన్ని వృధా చేస్తే జీవితాంతం కష్టపడాల్సి వస్తుందన్నారు. ప్రతి విద్యార్థి శ్రమే ఒక ఆయుధంగా చదువుతే విజయం తమ బానిసై తమ వెంటే వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు కాలేజీ ఎడ్యుకేషన్ వారు ఎప్పటికప్పుడు నిత్య నూతనమైన మార్పులను తీసుకొస్తుందన్నారు. అందులో భాగంగానే విద్యార్థులలోని శక్తి సామర్థ్యాలను, ప్రతిభాపాటవాలను వెలికితీయడానికి జిజ్ఞాస లాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాంకులే పరమావధిగా కాకుండా జీవితంలో తమ కాళ్ళపై తాము ఏ విధంగా నిలబడొచ్చో శిక్షణ నిచ్చే వేదికలుగా ఉన్నాయని పేర్కొన్నారు.

నేడు విద్యార్థులు డ్రగ్స్ లాంటి ప్రమాదకరమైన వాటి నుండి జాగ్రత్త పడి తమ భవిష్యత్తును తామే నిర్మించుకోవాలన్నారు.

అదృష్టవశాత్తు ఈ కళాశాల కోఎడ్యుకేషన్ కళాశాల గా మారడం వల్ల ఆడపిల్లలకు ఎన్. సి. సి.లాంటి వాటిలో చేరడానికి మంచి అవకాశం లభిస్తుందని అన్నారు. వచ్చే అకాడమిక్ ఇయర్ నుండి ఈ కళాశాల అటానమస్ గా మారడం ఈ ప్రాంత వాసులందరికీ శుభ సూచకమని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ డా. నిక్కత్ అంజుమ్ మాట్లాడుతూ అందరి కృషి ఫలితంగా ఈ కలశాల తిరిగి కోఎడ్యుకేషన్ గా మారిందన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుండి మన కళాశాల అటానమస్ గా మారడం గజ్వేల్ పరిసర ప్రాంత విద్యార్థిని విద్యార్థులకు చాలా అదృష్టంగా పేర్కొన్నారు. ఈ కళాశాల లో చదివిన చాలామంది విద్యార్థులు అత్యున్నతమైన స్థానాన్ని పొందాలని పేర్కొన్నారు. ఈ మధ్యకాలంలో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన పలు రకాలైన విభాగాలలో అనేక ప్రభుత్వ ఉద్యోగాలు ఈ కళాశాల విద్యార్థులు పొందడం జరిగిందన్నారు.

బహుళ జాతి కంపెనీలకు సంబంధించినటువంటి వారు స్వయంగా వచ్చి మన కళాశాలలో జాబ్ మేళాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఆయా జాబ్ మేళలో పదుల సంఖ్యలో మన కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఉద్యోగాలు పొందడం జరిగిందని పేర్కొన్నారు. గత నెలలో కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన అగ్ని వీర్ పరీక్షలలో సైతం మన కళాశాలకు చెందిన విద్యార్థులు ఉద్యోగాలను పొందడం శుభసూచికమన్నారు. దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు నిర్వహించిన పీజీ పరీక్షలలో కూడా మన కళాశాల విద్యార్థులు మంచి ఫలితాలను సాధించడం మనందరికీ గర్వకారణం అని పేర్కొన్నారు. ఇలా దినదినాభివృద్ధి చెందుతున్న మన కళాశాలలను మరింత అభివృద్ధి దిశగా తీసుకు వెళ్లడంలోసి .పి. డి .సి .మెంబర్లతో పాటు ఈ కళాశాల పూర్వ విద్యార్థులు, విద్యావంతులు, ప్రజాప్రతినిధులు, కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి ఆత్మీయ అతిథిగా ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం, కళాశాల సి.పి.డి.సి. మెంబర్లు టి . లక్ష్మణ్, గోపాల్ రెడ్డి, రాజమౌళి, డా. పద్మజ్యోతి, కె. సుభాష్ చంద్రబోస్, ప్రొఫెసర్ ఎం. శ్రీధర్, బంగారు పతకదాతలు డా. బండి రాజు, శ్యామ్ మనోహర్, వైస్. ప్రిన్సిపల్ ఎస్. గణపతి రావు, ఐక్య సి కోఆర్డినేటర్ డా. బి. వెంకటేష్, అకాడమిక్ కోఆర్డినేటర్ కెప్టెన్ .డా. ఎం. భవాని ఎన్సిసి కోఆర్డినేటర్ ఆర్. మహేందర్ రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ విజయభాస్కర్ రెడ్డి, ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్స్ వై. రామచంద్రం, మహేందర్, పెద్దిరాజు, హాజరై ప్రసంగించారు. కళాశాల వార్షికోత్సవం సందర్భంగా వివిధ సబ్జెక్టులలో అత్యున్నత ప్రతిభను కనపర్చిన విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ ను ప్రధానం చేయడం జరిగింది. తదనంతరం ఆటల పోటీలు సాహిత్య సాంస్కృతిక కార్యక్రమాలలో విజేతలుగా నిలిచిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతుల ప్రధానం చేయడం జరిగింది.

# జై బాపు.. జై భీమ్ జై సంవిధాన్ అభియాన్

**జయభేరి, సైదాపూర్ :**




అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) ఆదేశాల మేరకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ సూచన మేరకు.. రెండవ రోజు రాజ్యంగా పరిరక్షణ పాదయాత్రలో భాగంగా.. జై బాపు జై భీమ్ జై సంవిధాన్ అభియాన్ రాజ్యంగా పరిరక్షణ కై గ్రామ గ్రామాన పాదయాత్రలో భాగంగా గురువారం సైదాపూర్ మండల కేంద్రంలోని దుద్దెనపల్లి గ్రామంలో స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జెండా ఊపి యాత్రను ప్రారంభించిన మండల పార్టీ అధ్యక్షుడు, AMC చైర్మన్ దొంత సుధాకర్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా భారత రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక సమానత్వం, మౌలిక హక్కులపై అవగాహన పెంపొందించడానికి, ప్రజాస్వామిక విలువలను రక్షించడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, గ్రామాల్లోని ప్రజల సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలను సూచించడమే ప్రధాన లక్ష్యమని.. సామాజిక న్యాయం, నిరుద్యోగ సమస్యలు, రైతుల సమస్యలు, మహిళా సాధికారత, విద్య, ఆరోగ్యం, పౌర హక్కుల పరిరక్షణ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు మాజీ ZPTC బత్తిని శ్రీనివాస్ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కొత్త తిరుపతి రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గుండారపు శ్రీనివాస్, కూతురు విద్యాన్ రెడ్డి, మ్యాకల రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు మిట్టపల్లి కిష్టయ్య, AMC వైస్ చైర్మన్ న్యాదెండ్ల రాజ్ కుమార్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు వేముల సాయికుమార్, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, AMC డైరెక్టర్లు, కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు, సోషల్ మీడియా వారియర్స్, నాయకులు, అనుబంధ సంఘాలు పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## తూంకుంట మున్సిపల్ కమిషనర్ కు అరుదైన గౌరవం

- అత్యధిక పన్నులు వసూలు చేసినందుకు అచీవర్ అవార్డు అందుకున్న కమిషనర్ వెంకట గోపాల్

**జయభేరి, ఏప్రిల్ 3:**

మేడ్చల్ జిల్లా తూంకుంట మున్సిపాలిటీ కమిషనర్‌కు అచీవర్ అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ అభివృద్ధి సంస్థలో గురువారం జరిగిన తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ల సమావేశంలో భాగంగా 202425 ఆర్థిక సంవత్సరం 85శాతం ఇంటి పన్నులు వసూలు చేసినందుకు తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్‌కు అచీవర్ అవార్డు లభించింది . అదేవిధంగా 202324 ఆర్థిక సంవత్సరంలోను 85 శాతం ఇంటిపన్నులు వసూలు చేసినందున కన్‌సిస్టెంట్ అచీవర్ అవార్డును అందుకున్నారు. కాగా ఈ అవార్డును డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శ్రీదేవి చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ కు బహుకరించారు. కాగా మున్సిపల్ అభివృద్ధితో పాటు ప్రజా సమస్యల పరిష్కారం, మౌలిక సదుపాయాల కల్పనలో తనకు సహకరించి ఇంతటి విజయానికి కారణమైన తోటి అధికారులు, సిబ్బందికి మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల్ కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి సహాయ సహకారాలతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాల్లో పాలు పంచుకుంటానని ఆయన తెలిపారు.

## బడుగుల అభ్యున్నతే లక్ష్యంగా సన్న బియ్యం పంపిణీ

- బియ్యం పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నేతలు

**జయభేరి, ములుగు, ఏప్రిల్ 03 :**



ప్రభుత్వం పేదల సంక్షేమార్థం శ్రీకారంచుట్టి అమలుచేస్తున్న ఉచితంగా సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలి ములుగు తహాశీల్దార్ ఆరిఫా సూచించారు. బుధవారం మండల పరిదిలోని పునరావాస కాలనీ బహిలంపూర్ లో రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన పేదలకు ఉచితంగా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని తహాశీల్దార్, కాంగ్రెస్ పార్టీ ములుగు మండలాధ్యక్షుడు తమళ్ళి శ్రీనివాస్, సీనియర్ నాయకులు ప్రభాకర్ గుప్త, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ ప్రధాన కార్యదర్శి కరుణాకర్ గౌడ్, మండల యాదవ సంఘం అధ్యక్షుడు ఐలేష్ యాదవ్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగుల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వం ఎళ్ళ వేళల శ్రమిస్తుందన్నారు. అందులో భాగంగానే మునుపెన్నడు లేని విధంగా పేదలకు రేషన్ దుకాణాల ద్వారా ఉచితంగా సన్న బియ్యం పథకాన్ని అందించి తోడుగానిలుస్తుందని కొనియాడారు. పేద ప్రజలందరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహాశీల్దార్ సూచిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ హరీష్, కాంగ్రెస్ సీనియర్ నాయ కులు, బబ్బురి శేఖర్ గౌడ్, శ్యాం సుందర్ రెడ్డి, చంద్రం యాదవ్,కొము రయ్య యాదవ్,శేఖర్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## ధ్వజస్తంభ ప్రతిష్టాపన మహోత్సవం

- జాలే బ్రదర్స్ నరసింహారెడ్డి తిలక్ రెడ్డి



**జయభేరి, చింతపల్లి :**

చింతపల్లి మండలం రాంనగర్ (పోలేపల్లి) సాగర్ హైవే పై ఉన్న వన మైసమ్మ దేవస్థానంలో ధ్వజస్తంభం నిర్మాణం చేయించిన జాలే బ్రదర్స్ లకు దేవస్థానం కమిటీ వారు ముఖ్య అతిథిలుగా ఘనస్వాగతం పలికారు అనంతరం పూజా కార్యక్రమంలో జాలే నరసింహా రెడ్డి ప్రేమలత తిలక్ రెడ్డి శృతి పాల్గొని వేదపండితుల ఆశీర్వాదాలు తీసుకున్నారు అనంతరం వారు మాట్లాడుతూ... దేవాలయల అభివృద్ధిలో మా కుటుంబం ఆండాగా ఉంటుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పంపిణీని పారదర్శకంగా చేపట్టాలి

- శామీర్ పేట లో రేషన్ దుకాణాన్నీ ఆకస్మికంగా సందర్శించిన గౌతమ్

**జయభేరి, ఏప్రిల్ 3:**




రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ ఒక బృహత్ కార్యక్రమం అని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. అయితే ఈ బియ్యం పంపిణీ కార్యక్రమం పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. శామీర్‌పేటలోని రేషన్ షాప్‌ను గురువారం ఆకస్మీకంగా సందర్శించి తనిఖీలు చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రేషన్ కార్డు కలిగిన ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యాన్ని అందించాలన్న సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి రేషన్ కార్డు దారు ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకాన్ని సద్వినియోగం చేసుకోని లబ్దిపొందాలని సూచించారు. ఎక్కడా కూడా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని, సన్నబియ్యం పంపిణీలో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని డీలర్‌కు సూచించారు. శామీర్‌పేట రేషన్ షాప్ పరిధిలో ఎంత మంది లబ్దిదారులున్నారు.

రేషన్ సరుకులు సరఫరా ఎంత అవుతుంది, క్రమం తప్పకుండా నెలవారిగా ఎంత మంది లబ్దిదారులు రేషన్ సరుకులు తీసుకుంటున్నారు అనే విషయాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. సరుకుల వివరాలను సంబంధిత రిజిష్టర్లలో నమోదు చేస్తున్నారా లేదా అని రేషన్ డీలర్ ఓంప్రకాష్ ని అడిగి తెలుసుకున్నారు. బియ్యం పంపిణీ నిర్వహిస్తున్న ఫింగర్ ప్రింట్ స్కానర్‌ను, స్కానర్ రశీదులను, తూకాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సివిల్ సప్లయ్ అధికారిని సుగుణబాయి, డిప్యూడి తహాసీల్దార్ సంయుక్త, ఆర్ఐ రాఘవ, శృతి, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల నమోదుకు అవకాశం

జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 3:

త్వరలో స్థానిక సంస్థల ఎన్నిక లకు నగారా మోగనుంది. ఎన్నికల సంఘం ఓటరు నమోదును నిరంతర ప్రక్రియగా చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ నాటికి కటాఫ్ తేదీని ఖరారు చేసి తుది ఓటరు జాబితాను ప్రకటించనుంది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 1 నుంచి 18 ఏళ్ళు నిండిన వారికి ఓటుగా నమోదుకు అవకాశం కల్పిస్తున్నారు.గతంలో ఓటర్ల నమోదుకు జనవరి 1 తేదీ మాత్రమే ప్రామాణికంగా తీసుకునేవారు. సదరు తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటరుగా అర్హత లభించేది. సదరు విధానానికి స్వస్తి పలికారు. జనవరి 1, ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 తేదీలను సైతం ప్రామాణికంగా తీసుకోవాలని ఎన్నికల సంఘం నిర్దేశించింది. జాబితాలో లాజికల్ పొరపాట్లు, డెమోగ్రాఫికల్ పొరపాట్లను పూర్తి స్థాయిలో సవరించాలని అధికారులను ఎన్నికల సంఘం ఆదేశించింది.ఏప్రిల్ లో చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి యంత్రాంగం సిద్ధమై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి తగు సూచనలు స్వీకరించడమే కాకుండా నమోదుకు సంబంధించిన నిబంధనలు వివరించారు. ఈ క్రమంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త ఓటర్లను నమోదు చేయించేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా గ్రామం, వార్డు, డివిజన్ స్థాయిలో ఉండే ఆయా పార్టీల నాయకులు తమకు అనుకూలంగా మలుచుకునేందుకు ఓట్ల నమోదుపై దృష్టి సారిస్తున్నారు.అరచేతిలోనే ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ముందుగా అధికారిక వెబ్ సైట్లోకి వెళ్లాలి. సర్వీస్ పోర్టల్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి. అందులో మొబైల్ నంబర్ సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం లాగిన్ అవ్వాలి. ఆన్లైన్లో కొత్త ఓటుకు రిజిస్ట్రేషన్ చేసు కోవడం, తప్పులను సరిచేసుకోవడానికి, ఓటు హక్కును ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బదిలీ చేసుకోవడానికి, జాబితాలో రెండు ఓట్లు ఉంటే ఒకదాన్ని తొలగింపు, ఇతర అంశాలకు సంబంధించి వేర్వేరుగా ఫారం6,




ఫారం7, ఫారం8 కనిపిస్తాయి. వాటిలో మీకు కావాల్సిన దానిపై క్లిక్ చేసి అందులో పొందుపర్చాల్సిన వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలి. వివరాలు ఏఈఆర్వోకు వద్దకు వెళ్తాయి. పరిశీలించి ఆమోదిస్తారు.వెబ్సైట్ ద్వారా నమోదు చేసుకోలేని పరిస్థితుల్లో మీ వద్ద ఉన్న మొబైల్లో https: voters. eci. gov. in యాప్ డౌన్లోడ్ చేసుకోవాలి. దానిపై క్లిక్ చేయగానే పోర్టల్ ఓపెన్ అవుతుంది. కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చు. జాబితాలో పేరుందా లేదా చూసుకునే అవకాశం కల్పించారు.ఓటరు గుర్తింపు కార్డు కావాలనుకునేవారు వెబ్ సైట్ లోకి వెళ్లాలి. అందులో ఈఎపిక్ కార్డు డౌన్లోడ్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి మొబైల్, ఎపిక్ కార్డు నంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. గుర్తింపు కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం అయితే ఓటీపీ వస్తుంది. లేకుంటే కాదు. ఫారం8 ద్వారా ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకోవచ్చు. తర్వాత గుర్తింపు కార్డును డౌన్లోడ్ చేసుకోవచ్చు.

### ఏయే ఫారం.. ఎందుకంటే...

ఫారం6: కొత్తగా ఓటరు నమోదు చేసుకునేందుకు ఈ దరఖాస్తును పూరించాలి. ఒక ఫొటో, వయసు నిర్ధారణ పత్రం(ఎస్సెస్సీ మెమో), చిరునామా ధ్రువీకరణ ఉండే కరెంట్ బిల్లు, నల్లా బిల్లు, ఇంటి పన్ను వంటి వాటిని జతచేయాలి.

ఫారం6ఏ: విదేశాల్లో ఉన్న వారి కోసం ప్రత్యేకంగా ఫార్మాట్ రూపొందించారు. ఎన్నారైలకు రాష్ట్ర ఎన్నికల సంఘం 2018 నుంచి ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.




ఫారం7: ఓటరు జాబితాలో అభ్యంతరాలకు ఈ ఫారంను పూరించాలి. ఓటరు మరణించినా, ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డా వారిని జాబితా నుంచి తొలగించాలని ఈ పారం ద్వారా ఫిర్యాదు చేయొచ్చు.

ఫారం8ఏ: పట్టణాల్లో చాలామంది ఒక కాలనీ నుంచి మరో కాలనీకి మారుతుంటారు. ఈ క్రమంలో ఓటు వేసేటప్పుడు ఇబ్బందులు పడుతుంటారు. వారి కోసం ఈ ఫారం ఉప యోగపడుతుంది. ఒక పోలింగ్ బూత్ నుంచి మరో సమీప పోలింగ్ బూత్ కు మారేందుకు దరఖాస్తు చేయాలి.ఇక ఓటరు నమోదు, ఎన్నికలకు సంబంధించి 1950 టోల్ ఫ్రీ నంబర్ కు ఫోన్ చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఫిర్యాదు కూడా చేయొచ్చు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సేవలు అందిస్తారు. అంతేకాకుండా ఇంటర్ నెట్ నుంచి ఈమెయిల్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.కరీంనగర్ జిల్లాలో ప్రస్తుతం 5,30337 మంది పురుషులు, 5.52.358 మంది మహిళలు, 61 ట్రాన్స్ జెండర్స్ మొత్తం 10,82,751 ఓటర్లు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు జాబితాలో మహిళలే ఎక్కువగా నమోదయ్యారు. ఈసారి సైతం వారి సంఖ్య పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు. యువత.. ఓటు నమోదుకు ముందుకు రావాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరుతున్నారు.



## కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందచేత

- మజీద్ పూర్ గ్రామంలో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించిన మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్

జయభేరి, ఏప్రిల్ 3:

శామీర్ పేట మండలం మజీద్ పూర్ గ్రామానికి చెందిన తుంకి బాలమ్మ ఇటీవల మృతి చెందారు. కాగా విషయం తెలుసుకున్న మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తుంకి రమేష్ వారి కుటుంబాన్ని పరామర్శించి 10 వేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. అదేవిధంగా గ్రామ పంచాయతీ సిబ్బంది గొట్టిముక్కల ఎట్టయ్య గారి తండ్రి గొట్టిముక్కల ఎల్లయ్య కూడా ఇటీవల మృతి చెందారు. కాగా వారి కుటుంబాన్ని కూడా పరామర్శించి 10 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి మానవతా దృక్పథంతో ముందుకు రావాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ తుంకి బిక్షపతి, మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోడూరి నర్మద ,తుంకి స్వామి , తుంకి లక్ష్మయ్య యూత్ కాంగ్రెస్ నాయకుడు కుడుముల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## మూడుచింతలపల్లిలో చలివేంద్రం ఏర్పాటు

- వేసవి కాలంలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయం - మాజీ సర్పంచ్ జామ్ రవి



జయభేరి, ఏప్రిల్ 3:

మూడుచింతలపల్లి మండల కేంద్రంలో చలికేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన మధురెడ్డి ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి మాజీ సర్పంచ్ జామ్ రవి హాజరయ్యారు. వేసవి కాలంలో చలి వేంద్రాలు ఏర్పాటు చేయడం వలన బాటసారుల దాహార్తిని తీర్చవచ్చునన్నారు. ఈ చలి వేంద్రాన్నీ ఏర్పాటు చేసిన మధురెడ్డిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో బాల్ రాజ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు నరసింహ, కేసర్ నర్సింలు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## కబడ్డీ టోర్నమెంట్ రెండవ బహుమతి



జయభేరి, గుడిపల్లి :


గుడిపల్లి మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీ రామ నవమి సంధర్బంగా ప్రతి సంవత్సరం నిర్వహించే కబడ్డీ టోర్నమెంట్ లో బాగంగా ఈ సారి కూడా నిర్వహించే కబడ్డీ టోర్నమెంట్ రెండవ బహుమతి 16000 రూపాయలు KLR యువత పోతిరెడ్డిపల్లి, గ్రామస్తుల అడగగానే కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి ఇవ్వడం జరిగింది గ్రామస్తులు రాజశేఖర్ రెడ్డిని అభినందించి రెండవ బహుమతి కొరకు అడిగిన వెంటనే స్పందించి ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలియజేసినారు.

## ప్రజాపాలనలో ముందస్తు అరెస్టులు




జయభేరి, దేవరకొండ :

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ (HCU) భూములను కాపాడేందుకు పోరాడుతున్న విద్యార్థులను ముందస్తుగా అరెస్టు చేయడం దేనికి సంకేతం ఇది విద్యార్థి హక్కులపై దాడి ఇది అధికార దుర్వినియోగం క్యాంపస్‌లో 400 ఎకరాల భూమిని ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ విద్యార్థులు శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి ఉంది. అధికార బలంతో,అక్రమ అరెస్టులతో, ప్రకృతిని నాశనం చేయాలని చూస్తే ఊరుకునే పరిస్థితి లేదు, విద్యార్థులపై దమనకాండ ఆపాలి! HCU భూములను రక్షించాలి విద్యార్థుల గొంతును నొక్కాలని చూస్తే, తెలంగాణలో ఆత్మగౌరవ ఉద్యమం మరింత మిన్నంటుతుంది రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి యువత ఏకమై ప్రభుత్వంపై ప్రతిఘటన తప్పదు అని ఏబీవీపీ ఉమ్మడి నల్లగొండ జిల్లా హాస్టల్స్ కన్వీనర్ యలమల గోపీచంద్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో పగిళ్ల విక్రమ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## హెచ్ సియు కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్లు కొట్టివేతపై హైకోర్టు స్టే

- పిటిషన్ పై విచారణ ఏప్రిల్ 7 వరకు వాయిదా

జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 3:

తెలంగాణలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్ సియు) కు సంబంధించిన భూముల వ్యవహారం ప్రస్తుతం హాట్ టాపిక్ గా మారింది. వర్సిటీ విద్యార్థులు ఆందోళనకు దిగడంతో వందల మంది పోలీసుల బందోబస్తు మధ్య అక్కడ జేసీబీలతో చెట్లను తొలగిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం. దీంతో కొందరు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ భూముల వ్యవహారంపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. హెచ్ సియు కంచ గచ్చిబౌలి భూముల్లో చెట్లు కొట్టివేతపై స్టే విధించింది.ఈ పిటిషన్ పై విచారణ ఏప్రిల్ 7 వరకు వాయిదా వేసిన హైకోర్టు.. అప్పటి వరకు అక్కడ చెట్లు కొట్టివేయవద్దని ప్రభుత్వానికి ఆదేశించింది. అయితే, హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ చెట్లు కొట్టివేత కొనసాగుతుందని పిటీషనర్ తరపు లాయర్ నిరంజన్ రెడ్డి ఆధారాలు చూపించారు. అలాగే, ఆధారాలు కోర్టుకు సమర్పిస్తున్న విద్యార్థుల మీద కేసులు పెడుతున్నారని కోర్టుకు తెలిపారు. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది.

## స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సభ్యులకు సన్మానం

జయభేరి, దేవరకొండ :

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బార్ అసోసియేషన్ సభ్యులకు ఘనంగా సత్కారం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనము నందు నూతనంగా ఎన్నికైన బార్ అసోసియేషన్ సభ్యులను శాలువాలతో సత్కరించి మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసినారు. దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు NVT మాట్లాడుతూ బాధితులకు సమన్యాయం అందించడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఉమామహేశ్వర్ మాట్లాడుతూ ఇండోర్ ఔట్డోర్ స్టేడియాల కోసం దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు చేస్తున్న కృషిని అభినందించారు.

భవిష్యత్తులో న్యాయపరంగా అండగా ఉంటామని భరోసా అందించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్




గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, రాపోలు గౌరవ అధ్యక్షులు కొండ్ర శ్రీశైలం,ముత్యాల సర్వయ్య, రాపోలు నిరంజన్ బత్తుల అమర్, వైయస్ కరుణాకర్ , భాస్కర్ రెడ్డి, తాళ్ల సురేష్, పులిపాటి సన్నీ, ఆంజనేయులు, ఖాజా, కరాటే మాస్టర్ శ్రీను, సిరాజ్ , జమీర్, డాన్స్ మాస్టర్ జగన్, తిరుపతయ్య, రాజు, భాస్కర్, మహేష్, జగదీష్, తదితరులు పాల్గొన్నారు. సన్మాన గ్రహీతలు అధ్యక్షులు ఉమా మహేష్. ఉపాధ్యక్షులు వసుకుల శ్రీను. ప్రధాన కార్యదర్శి కర్నాటి సురేష్. సహాయ కార్యదర్శి మంటి పెళ్లి యాదయ్య, కోశాధికారి సపవాత్ శ్రీకాంత్. కార్యవర్గ సభ్యులు ఎర్ర కృష్ణ, రామావత్ గణేష్, జున్ను ఇద్దయ్య, కేతావత్ శంకర్.

## ఆహార భద్రతా కల్పించడమే కాంగ్రెస్ లక్ష్యం

జయభేరి, ములుగు, మార్చి 03 :

ములుగు మండలం చిన్న తిమ్మాపూర్ వంటిమామిడి గ్రామపంచాయతీ లో గల రేషన్ ప్రభుత్వ ఉచిత సన్న బియ్యంను గురువారం ప్రారంభించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గజ్వేల్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి ఆధ్వర్యంలో ములుగు మండలం ఆర్ఐ, గ్రామ సెక్రెటరీ చేతుల మీదుగా సన్న బియ్యం పంపిణీ నీ రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ములుగు మండలం పార్టీ అధ్యక్షుడు తమ్మల శ్రీనివాస్, డీలర్ డాకూరి యాదగిరి, గ్రామ ఇంద్రమ్మ కమిటీ సభ్యులు డాకూరి అర్జున్ , గుండ్లపల్లి వెంకటేష్ గౌడ్ ,కన్నెబోయిన శేఖర్ యాదవ్, మహమ్మద్ సలీమా, బలిజ కవిత, గ్రామ సీనియర్ నాయకులు. బలిజ వెంకటేష్. మహమ్మద్ హాజీ బాబా, కాశబోయిన శేఖర్ ముదిరాజ్, డాకూరి నవీన్ మార్చబోయిన భీష్మ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.




06
జయభేరి సినిమా
04-04-2025
శుక్రవారం
jayabheridaily.com



# టిల్లుకు మించి జాక్ నవ్విస్తాడు

'సిద్ధులాంటి నటుడితో పనిచేయడం ఏ దర్శకుడికైనా సులభంగా ఉంటుంది. ప్రతీ సీన్‌లో అద్భుతంగా నటిస్తాడు. ఈ సినిమా విషయంలో రైటింగ్ స్టేజీ నుంచే సిద్ధు బాగా ఇన్‌వాల్వ్ అయ్యాడు. జాక్ క్యారెక్టరైజేషన్, డైలాగ్ మాడ్యులేషన్‌లో సిద్ధుకే స్వేచ్ఛనిచ్చాను' అన్నారు బొమ్మరిల్లు భాస్కర్. ఆయన దర్శకత్వంలో సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'జాక్‌కొంచెం క్రాక్'. బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మాత. ఈ నెల 10న విడుదలకానుంది. గురువారం ట్రైలర్‌ను విడుదల చేశారు. మనలో ప్రతీ ఒక్కరిలో జాక్ ఉంటాడని, ఆ జాక్ ఎవరనేది ఎవరికి వాళ్లే తెలుసుకోవాలని, ఈ సినిమాలో భావోద్వేగాలతో పాటు చక్కటి సందేశం ఉంటుందని బొమ్మరిల్లు భాస్కర్ అన్నారు. టిల్లు ఏ మీటర్‌లో ఉంటుందో అంతకు మించి జాక్ పాత్ర ఉంటుందని, ఇంటర్వెల్‌లో వచ్చే చార్మినార్ ఎపిసోడ్ ఇంటర్నేషనల్ రేంజ్‌లో ఉంటుందని, కథలోని ట్విస్టులు ఉత్కంఠను పంచుతాయని హీరో సిద్ధు జొన్నలగడ్డ తెలిపారు. బొమ్మరిల్లు భాస్కర్ వంటి గొప్ప దర్శకుడితో పనిచేయడం ఆనందంగా ఉందని, సిద్ధు నుంచి ఎన్నో కొత్త విషయాలను నేర్చుకున్నానని కథానాయిక వైష్ణవి చైతన్య చెప్పింది. భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నామని నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: సురేష్ బొబ్బిలి, రథన్, అచ్చు రాజమణి, రచనదర్శకత్వం: బొమ్మరిల్లు భాస్కర్.

# రుద్ర సికిందర్ అఘోరా పార్ట్ కంప్లీట్?



అగ్రహీరో నందమూరి బాలకృష్ణ ప్రస్తుతం 'అఖండ - తాండవం' షూటింగ్‌లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. బ్లాక్‌బస్టర్ 'అఖండ'కు ఇది సీక్వెల్. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరగుతున్నది. ఎట్టి పరిస్థితుల్లో దసరా కానుకగా సినిమాను విడుదల చేయాలనే సంకల్పంతో మేకర్స్ పనిచేస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన తాజా సమాచారం ఒకటి వెలుగు చూసింది. 'అఖండ'లో బాలయ్య డ్యూయెల్ రోల్ చేసిన విషయం తెలిసిందే. ఈ సీక్వెల్‌లోనూ అది కొనసాగుతుందట. అందుకే బోయపాటి ఓ ప్లాన్ ప్రకారం.. తొలుత అఘోరా పాత్రకు సంబంధించిన సన్నివేశాలన్నీ పూర్తిచేసే పనిలో ఉన్నారట. అందుతున్న సమచారం మేరకు కొన్ని యాక్షన్ సీక్వెన్స్ మినహా అఘోరా పార్ట్ అంతా కంప్లీట్ అయినట్టు తెలుస్తున్నది. దానికి బలాన్నిస్తూ.. రీసెంట్‌గా 'ఆదిత్య 369' రీరిలీజ్ ఈవెంట్‌లో బాలకృష్ణ క్లీన్ షేవ్‌తో కనిపించారు. మిగిలిన యాక్షన్ సన్నివేశాలను బాడీ డబుల్స్‌తో కానిచ్చేస్తారట. ఇక రెండో బాలకృష్ణ పాత్రకు సంబంధించిన షూట్ త్వరలోనే మొదలుకానున్నదట. జూన్ నాటికి మొత్తం టాకీని కంప్లీట్ చేస్తారని తెలుస్తున్నది. తమన్ స్వరాలందిస్తున్న ఈ చిత్రాన్ని 14రీల్స్ పతాకంపై రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట నిర్మిస్తున్న విషయం తెలిసిందే.




# బైక్‌పైనే వెళ్లే స్టార్ హీరోయిన్..

సాధారణంగా సినిమా తారలు లగ్జరీ కార్లలో తిరిగేందుకు ఎక్కువగా ఇష్టపడుతుంటారు. జిమ్ లు , షాపింగ్ లు, షూటింగ్ స్పాట్ కు, ఆఖరికి చిన్న దూరానికైనా కార్లనే ఎక్కువగా వినియోగిస్తుంటారు. అయితే ఈ స్టార్ హీరోయిన్ మాత్రం చాలా డిఫరెంట్. కోట్లాది రూపాయల ఆస్తులున్నప్పటికీ సింపుల్ గా బైక్ పైనే వెళుతుంటుంది. ఈ ముద్దుగుమ్మ సినిమా ఇండస్ట్రీలోకి అడుగు పెట్టి సుమారు ఆరేళ్లయ్యింది. అయితే గతేడాది వరకు ఈ బ్యూటీ గురించి ఎవరికీ పెద్దగా తెలియదు. కానీ ఒకే ఒక సినిమా ఈ సొగసరిని ఓవర్ నైట్ స్టార్ ను చేసేసింది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ కు ఉన్న డిమాండ్ , ఫ్యాన్ ఫాలోయింగ్ చూస్తే మెంటలెక్కిపొద్ది. ప్రస్తుతం ఒక్కో సినిమాకి కోటి నుంచి 3 కోట్ల వరకూ పారితోషికం తీసుకుంటుందీ అందాల తార. అలాగే సోషల్ మీడియాలో తన కున్న క్రేజ్ ను వినియోగించుకుంటూ ఒక్కో ఇన్ స్టా యాడ్ పోస్ట్ కి లక్షల ఆదాయం ఆర్జిస్తోంది. ప్రస్తుతం ఈ హీరోయిన్ నికర ఆస్తి విలువ సుమారు రూ. 30 కోట్లకు పైగానే ఉంటుంది. అయితేనేం సింపుల్ గానే ఉండడానికే ఇష్టపడుతోందీ క్రేజీ హీరోయిన్. తాజాగా ఈ ముద్దుగుమ్మ బైక్ పై సింపుల్ గా జర్నీ చేస్తూ కనిపించింది. ఇప్పుడే గతంలోనూ పలు సార్లు ఇలాగే బైక్ పైనే జర్నీ చేస్తూ దర్శనమిచ్చింది. దీంతో సినీ అభిమానులు ఈ హీరోయిన్ సింప్లిసిటీని తెగ పొగిడేస్తున్నారు. మరి ఈ ముద్దుగుమ్మ ఎవరో గుర్తు పట్టారా? తను మరెవరో కాదు యానిమల్ బ్యూటీ తృప్తి దిమ్రి ముంబై నగరంలో ఉన్న ట్రాఫిక్ సమస్యల నుంచి తప్పించుకోవాలంటే బైక్ పైనే వెళ్లడం సురక్షితమంటోంది తృప్తి దిమ్రి. అందుకే తాను బైక్ జర్నీకే ప్రాధాన్యమిస్తానంటోందీ అందాల తార. తాజాగా ముంబై రోడ్లపై బైక్ పై షికారు చేస్తూ కనిపించింది తృప్తి. ఇందుకు సంబంధించిన దృశ్యాలను ముంబై ఫోటోగ్రాఫర్లు తమ కెమెరాల్లో బంధించారు. అనంతరం వాటిని సోషల్ మీడియాలలో షేర్ చేశారు. దీంతో ఈ ఫొటోలు, వీడియోలు కాస్తా నెట్టింట వైరల్ గా మారాయి.

# రచ్చ చేస్తోన్న అర్జున్ రెడ్డి హీరోయిన్..

ప్రస్తుతం ఓటీటీలో హారర్, రొమాంటిక్, సస్పెన్స్ థ్రిల్లర్ మూవీస్ ఎక్కువగా దూసుకుపోతున్నాయి. కంటెంట్ బాగుండాలే కానీ చిన్న సినిమాలకు పట్టం కడుతున్నారు సినీప్రియులు. ఈమధ్య కాలంలో ఎక్కువగా ఆద్యంతం ఉత్కంఠతో సాగే సినిమాలు చూసేందుకు జనాలు ఇంట్రెస్ట్ చూపిస్తున్నారు. ఓటీటీల్లో డిఫరెంట్ జానర్ సినిమాలు మంచి రెస్పాన్స్ అందుకుంటున్నాయి. తెలుగుతోపాటు తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషలలో తెరకెక్కించిన చిత్రాలు ఇప్పుడు ఓటీటీలో సత్తా చాటుతున్నాయి. అలాంటి చిత్రాల్లో టాలీవుడ్ హీరోయిన్ షాలిని పాండే నటించిన క్రైం థ్రిల్లర్ మూవీ ఒకటి. మహిళా మాఫియా నేపథ్యంలో రూపొందించిన వెబ్ సిరీస్ డబ్బా కార్టెల్. ప్రస్తుతం ఓటీటీలో ఈ సిరీస్ కు విపరీతమైన క్రేజ్ వస్తుంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్ ఫామ్ నెట్ ఫ్లిక్స్ లో ఫిబ్రవరి 28న అందుబాటులోకి వచ్చిన ఈ సిరీస్ ప్రస్తుతం టాప్ 3 ట్రెండింగ్ లో దూసుకుపోతుంది. ఇందులో సీనియర్ నటి షబానా అజమీ, జ్యోతిక, నిమిషా సంజయన్, షాలినీ పాండే ప్రధాన పాత్రలలో నటించగా.. హితేష్ భాటియా దర్శకత్వం వహించారు. ఈ సిరీస్ విభిన్నమైన కథతో.. ఊహించని ట్విస్టులతో ఆకట్టుకుంటుంది. లంచ్ బాక్సుల ద్వారా డ్రగ్స్ సరఫరా చేసే మహిళల కథ ఆధారంగా ఈ చిత్రాన్ని.. థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ తో రూపొందించారు. ఈ సిరీస్ కు గౌరవ్ రైనా, తానా మర్వా సంగీతం అందించగా.. ఈషిత్ నరైన్ సినిమాటోగ్రఫీ అందించారు. ముంబై నగరంలో జనాలకు లంచ్ బాక్సులు సరఫరా చేసే కొందరు మహిళలు ఎక్కువ డబ్బు కోసం వాటిలో డ్రగ్స్ సరఫరా చేస్తుంటారు. ఈ నెట్ వర్క్ ను విచారణ చేసే క్రమంలో పోలీసులకు అనేక షాకింగ్ విషయాలు బయటకు వస్తాయి. ఫార్మా కంపెనీలతో ఈ డ్రగ్స్ మాఫియాకు సంబంధం ఏంటీ ? ఈ మార్గాన్ని మహిళలు ఎందుకు ఎంచుకున్నారు ? చివరకు పోలీసులకు నిజాలు ఎలా తెలిశాయి అనేది సినిమా. ఆద్యంతం ఆసక్తికరంగా.. ఊహించని ట్విస్టులతో థ్రిల్లింగ్ ఎలిమెంట్లతో సాగింది.





# గృహ హింస కేసు.. బాంబే హైకోర్టును ఆశ్రయించిన హన్సికా మోత్వానీ

టాలీవుడ్ నటి హన్సికా మోత్వానీ బాంబే హైకోర్ట్‌ను ఆశ్రయించింది. తనపై నమోదైన గృహ హింస కేసును కొట్టివేయాలని కోరుతూ బాంబే హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖాలు చేసింది. గతేడాది ప్రశాంత్ మోత్వానీ (హన్సికా మోత్వానీ సోదరుడు) భార్య ముస్కాన్ నాన్సీ హన్సిక కుటుంబంపై గృహ హింస కేసును నమోదు చేసిన విషయం తెలిసిందే. 2024న డిసెంబర్ 18న ముంబైలోని అంబోలి పోలీస్ స్టేషన్‌లో ఈ ఫిర్యాదు నమోదైంది. ఇందులో హన్సికా, ఆమె తల్లి మోనా మోత్వానీ తన భర్తతో వివాహం, రిలేషన్‌షిప్ విషయంలో జోక్యం చేసుకొని మనస్పర్థలు వచ్చేలా చేశారని ముస్కాన్ ఆరోపించింది. తన భర్త గృహ హింసకు కూడా పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొంది. ఈ పరిస్థితుల నేపథ్యంలో తాను బెల్ ఫాల్సీ అనే నాడీ సంబంధిత రుగ్మత (పక్షవాతం) బారిన పడ్డానని చెప్పింది ముస్కాన్ . హన్సిక, అత్త ఆస్తి లావాదేవీలకు సంబంధించి మోసపూరిత కార్యకలాపాలకు పాల్పడుతున్నారని తెలిపింది.

అయితే ఈ కేసు విషయంలో హన్సికా, ఆమె తల్లి జ్యోతి మోత్వానీ తమపై నమోదైన సెక్షన్ 498A కేసును రద్దు చేయాలని బాంబే హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ సరంగ్ కోట్వాల్, జస్టిస్ SM మోడక్‌లతో కూడిన ధర్మాసనం ముస్కాన్ నాన్సీకి నోటీసులు జారీ చేసి తదుపరి విచారణను జూలై 3కి వాయిదా వేసింది.
ముస్కాన్ నాన్సీ జేమ్స్ టీవీ నటిగా గుర్తింపు తెచ్చుకుంది. "మాతా కీ చౌకీ" సీరియల్‌లో నటించి స్టార్ అయిన ఈ భామ 2021లో ప్రశాంత్ మోత్వానీని వివాహం చేసుకుంది. అయితే ఈ జంట 2022లోనే విడిపోవాలని నిర్ణయించుకుంది. కానీ సడన్‌గా నాన్సీ 2024 డిసెంబర్‌లో మోత్వానీ కుటుంబంపై గృహ హింస కేసు పెట్టడంతో ఈ విషయం సంచలనంగా మారింది. గృహ హింస కేసులో హన్సికా, ఆమె తల్లి జ్యోతి మోత్వానీ కేసు నమోదు అవ్వగా.. గత ఫిబ్రవరి ముంబై సెషన్స్ కోర్టు నుండి ముందస్తు బెయిల్ పొందారు.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com